# 9

# ఒక వేసవి సాయంత్రం

*నిజమే దేనికోసమైతే అర్ధరాత్రి బుద్ధుడు అర్ధాంగినొదిలి పెట్టి వెళ్ళి పోయినట్లుగా సిద్ధార్థ తన ఆస్తిపాస్తు లన్నింటినీ వదిలిపెట్టి బయట కొచ్చాడో, ఆ పీడితజనపక్షాన నిల్చి అతడేం వ్రాసినా బహుమతికి అర్హమైనవే కదా.*

"కాంతీ... కాంతీ... యింకా ఎంతసేపు," ఈసారి సిద్ధార్థ గొంతులోని అసహనాన్ని గమనించి చప్పున స్టౌ ఆర్పేసి చీర కట్టుకుంటే కొంత ఆలస్యమవుతుందని చుడీదార్‌లోకి దిగిపోయింది కాంతి. చిల్లరుందో, లేదో కూడా గమనించుకోకుండా హేండ్‌బ్యాగ్ భుజానికి తగిలించుకుని బయటపడింది.

అప్పటికే అక్కడ ఎదురుచూస్తున్న సిద్ధార్థ యింటికి తాళం పెట్టాడు.

"ఏమిటంత లేటు, సభ ప్రారంభమైపోయి వుంటుంది. ఆ బహుమతేదో తీసుకుని త్వరగా వచ్చేస్తే ఒక పనయిపోతుంది కదా... ఆటో ఎక్కుదామా?"

"వొద్దొద్దు... పదినిమిషాల నడక... అంత ప్రాంప్ట్‌గా ఏం ప్రారంభించరులే..." ఖచ్చితంగా చెప్పి వడివడిగా అడుగులేసింది.

నాలుగు అడుగులూ వడివడిగా ముందుకు సాగాయి. వీధి మలుపు వద్ద దయాకర్ ఎదురై, "మీరూ యిప్పుడే బయల్దేరారా?" అంటూ వీళ్ళతో కలిశాడు.

అప్పటికి ఉదయం నుండీ తాను మండుతూ సర్వప్రపంచానికి వెలుతురు పంచిన సూర్యుడు యిక వీడ్కోలు పలుకుతూ పసుపూ, కాషాయరంగూ కలగలిసిన వింత కాంతుల్ని భూమ్మీదికి వదుల్తున్నాడు. ఆ దృశ్యాన్ని గమనిస్తూ ఒక అడుగువెనుక పడింది కాంతి.

మౌనంగా దయాకర్‌తో కలిసి ముందు నడుస్తోన్న సిద్ధార్థని గమనిస్తూ ఆలోచనలో పడింది. మామూలు గోధుమరంగు ఖద్దరు బట్టలతో కట్టిన పైజమా, లాల్చీల్లో నుండి చామనఛాయగా వున్న సిద్ధార్థ శరీరం మెరుస్తోంది.

నిజానికి సిద్ధార్థకి తన బట్టలమీద ఎప్పుడూ ఆసక్తి వుండదు. తనే పోరుపెట్టి మీటింగులకి, సభలకి యిటువంటి బట్టలయితేనే బావుంటుందని కుట్టించింది. ఒక్కో సారి మనిషికి ఆహార్యం కూడా అవసరమేనంటూ వాదించింది.

"హైద్రాబాద్ నుండి ఇద్దరు కవులెవరో వచ్చారట. నాకూ తెలీదు," చెప్తున్నాడు దయాకర్.

"ఏంటో వద్దంటుంటే పంపింది కాంతి" విసుగ్గా అంటున్నాడు సిద్ధార్థ.

ఎందుకోగాని సిద్ధార్థ కొంత టెన్స్‌గా వున్నాడు. తనకి ఇటువంటి సభలన్నా, పోటీల కోసం పనిగట్టుకుని వ్రాయడమన్నా తగని చిరాకు.

ఆ రోజు ప్రకటన చూసి తనే పట్టుబట్టి సిద్ధార్థతో పోటీకి కవిత పంపేలా చేసింది. సిద్ధార్థ బలవంతంగా తనతో ఏపనీ చేయించడుగాని, తనే మొండిపట్టుగా సిద్ధార్థతో అప్పుడప్పుడూ కొన్ని పనులు చేయిస్తుంటుంది.

అయినా సరే ఎప్పుడూ కోపం తెచ్చుకోడు.

సిద్ధార్థ కోపమూ, చిరాకూ అంతా ఈ కులాల కుమ్ములాటల మీదే. ఎక్కువ మనుషులూ, తక్కువ మనుషులూ అన్న తేడాల మీద. తక్కువ మనుషుల్ని ఎంతమాత్రం ముందుకెళ్ళనివ్వని ఎక్కువ మనుషులమీద. అతడి ఆలోచనలూ, అభిప్రాయాలూ, అంతర్మథనమూ అంతా అదే. అసమానతలు లేని ఒక కొత్త ప్రపంచం కోసం. కొత్త సమాజం కోసం.

"ఏంటి కాంతీ మౌనంగా వున్నావు. గురుడేంటి సీరియస్‌గా వున్నాడు," దయాకర్ ఒక అడుగు వెనక్కేసి సిద్ధార్థకు వినపడని స్వరంతో ప్రశ్నించాడు.

నవ్వింది కాంతి.

"కవిత పోటీకి పంపానని... బహుమతి వచ్చిందనీ," గుసగుసగా అంటూ సిద్ధార్థ కేసి చూసింది.

"తప్పేముంది... తన తపనంతా పీడితజనం కోసమే కదా... అదే వ్రాశాడు. అదే పంపావు. దానికే బహుమతొచ్చింది... హర్షించాలి."

నిజమే దేనికోసమైతే అర్ధరాత్రి బుద్ధుడు అర్ధాంగినొదిలి పెట్టి వెళ్ళిపోయినట్లుగా సిద్ధార్థ తన ఆస్తిపాస్తులన్నింటినీ వదిలిపెట్టి బయటకొచ్చాడో, ఆ పీడితజనపక్షాన నిల్చి అతడేం వ్రాసినా బహుమతికి అర్హమైనవే కదా.

"అరవింద్ మరణమే సిద్ధార్థని చాలా మార్చేసింది. ప్చ్..." దయాకర్ సిద్ధార్థ ఊరివాడే. చిన్ననాటి నుండీ కలిసి తిరిగిన, కలిసి చదువుకున్న మిత్రులు.

కలిచేడు దుర్ఘటనలో... గాయపడ్డ నిమ్నకులాలవారికి వైద్యం చేయడం కోసం వెళ్ళిన సిద్ధార్థ అన్న డాక్టర్ అరవింద్ అక్కడి ఘోర దృశ్యాల్ని, మనుషుల్ని ఖండఖండా లుగా నరికేసిన వైనాన్ని... గోనెసంచుల్లో కూరి మూతి బిగించి కట్టి కుప్పలుకుప్పలుగా పోసి తగలబెట్టిన పెద్దకులాల వారిని చూసి అసహ్యంతో, ఆలోచనతో, ఆందోళనతో సాటి మనుషుల్ని మనుషులుగా చూడలేని పెద్దకులంలో పుట్టినందుకు సిగ్గు పడుతున్నా నంటూ ఆ రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

"అరవింద్ మరణం సిద్ధార్థని అతలాకుతలం చేసేసింది. ఆ సంఘటనతోనే విరక్తి చెంది అమ్మానాన్నల్ని, అక్కాచెల్లెళ్ళనీ, ఆస్తిపాస్తుల్నీ వదిలిపెట్టి వచ్చేశాడు," ఇదివరకు ఎన్నోసార్లు చెప్పిందే అయినా... అప్పుడే మొదటిసారి చెబుతున్నట్టుగా చెప్పాడు దయాకర్.

దయాకర్ చెప్పేది వింటూ మౌనంగా తలూపింది కాంతి. పదడుగులముందు నడుస్తున్నాడు సిద్ధార్థ.

"మళ్ళీ కొత్త బంధనాల్ని తగిలించుకోడం సిద్ధార్థకి యిష్టంలేదు. మిత్రులందరి ఒత్తిడి మూలంగానూ... నువ్వూ, నీ వ్యక్తిత్వమూ నచ్చడంతోనూ అతడి జీవితంలో భాగమైపోయావు." ఇందుకు నేనూ కారణమే సుమా అన్నట్లుగా నవ్వాడు దయాకర్.

"నిజమే మొదట్లో సిద్ధార్థ మాటలు ఎంతకీ అర్థమయ్యేవికావు. ఉన్నట్టుండి, 'అనాథగా తిరుగుతోన్న పద్యాన్ని గురించి మాట్లాడుకుందాం,' అనేవాడు. ఒక్కోసారి కన్నీళ్ళు తిరుగుతుండగా ఆకల్ని చంపుకోవాలో, తమకు తాము చంపుకోవాలో తెలీక రెక్కలల్లార్చే వర్గాల గురించి పెదవులెండుకు పోతూ చెప్పేవాడు. అదో కొత్త స్థితి నాకు."

మంద్రస్వరంతో చెప్తూ అడుగులేస్తోంది కాంతి.

ఇవ్వాల్టి రోజుకోసం తనూ, సిద్ధార్థ గత నెలరోజులుగా ఎదురుచూస్తున్నారు. అయితే విడివిడిగా వేరువేరు కోణాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందిన సిద్ధార్థ కవిత అందలమెక్కడాన్ని కళ్ళారా చూడాలని తను ఆత్రుత పడుతూంటే... మొదటి బహుమతి తాలూకు డబ్బులందగానే ఈనెల్లో తను కొన్న మిక్సీ అప్పు కట్టేయా లని సిద్ధార్థ తొందరపడుతున్నాడు. అంతేకాకుండా ఈ డబ్బులొస్తాయి కదాని ఒక

కాలేజీ కుర్రాడికి అప్పుతెచ్చి ఫీజు కట్టాడు. ఇవి రెండూ తీర్చేస్తేనే తప్ప అతడికి మనశ్శాంతి దొరికేలా లేదు.

అనవసరంగా మిక్సీ కొన్నానేమోనని పశ్చాత్తాపపడింది కాంతి. కాంతి ఒక ప్రైవేటు స్కూల్లో పన్చేస్తోంది. సిద్ధార్ధ కింకా నిర్దిష్టమైన కొలువులేదు. అయినా ఒక పేద విద్యార్థినికి ఫీజులు కడుతున్నాడు.

ఆలోచనలలో నుండి ఆలోచనలోకి ప్రయాణిస్తున్న కాంతి కీచుమంటూ వెలువడిన వికృతమైన శబ్దంతో ఉలిక్కిపడి తేరుకుంది.

'అయ్యో,' అంటూ సిద్ధార్ధ, దయాకర్ ఆ వృద్ధుణ్ణి వంగి పైకి లేపడానికి ప్రయత్నిస్తున్నారు.

"హయ్యో, దేవుడా..." అంటూ అరుస్తున్నాడా వృద్ధుడు నడుంపట్టుకుని. నడుం బాగా అదిరినట్టుంది. మోకాలు చీరుకుపోయి నెత్తురోడుతోంది. లేవడానికి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి మోకాలు సహకరించకపోవడంతో ఒరిగి పోతున్నాడతడు.

'మరీ స్పీడయి పోతున్నారీ కుర్రాళ్ళు. అర్థంపర్థం లేకుండా" అప్పటికే గుమికూడిన గుంపులో ఎవరో అంటున్నారు యాక్సిడెంటు చేసి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయిన మోటార్‌సైకిల్ కుర్రాళ్ళ నుద్దేశించి.

ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతున్నారేగాని... ఎవ్వరూ అతడ్ని గురించి పట్టించుకోడానికి సిద్ధపడ్డంలేదు.

అటుగా వెళ్తోన్న ఆటోని ఆపాడు సిద్ధార్ధ. ఆటో అతను, దయాకర్‌ల సాయంతో వృద్ధుడ్ని లోపలికి పడుతున్న సిద్ధార్ధని చూసి విస్తుపోయింది కాంతి.

"కాంతీ ఎక్కు..." ఆ గొంతులోని ఖచ్చితత్వాన్ని కాదనడానికి ఎవరికీ శక్తి చాలదు. అప్రయత్నంగా ఆటో ఎక్కింది కాంతి.

స్నేహితుడయిన డాక్టర్ కరుణాకర్ వద్దకు తీసికెళ్ళి గాయానికి కట్టుకట్టించి, కావలసిన మందులిప్పించి అతడిని ఆటో ఎక్కించి యింటికి పంపితేనే కాని ఊపిరాడ లేదు సిద్ధార్ధకీ, దయాకర్‌కీ.

"అదృష్టవశాత్తూ పెద్ద ఫ్రాక్చరేం లేదు," తృప్తిగా అన్నాడు దయాకర్. దీర్ఘంగా నిట్టూర్చాడు సిద్ధార్ధ.

✦ ✦ ✦

"ఇవ్వాల్టి సాహితీకారులతో నాకదే పేచీ... సమాజంలోని ప్రతీ చిన్నా, పెద్దా లోటుపాట్లన్నింటికీ ప్రభుత్వాన్ని కారణభూతం చేసి ఎండగట్టడం ఒక ఫ్యాషనయి పోయింది కవులకూ, రచయితలకూ... అన్నిటికీ ప్రభుత్వాన్నే దోషిని చేస్తున్నారు. వానలు రాకపోతే ప్రభుత్వం, పంటలు పండకపోతే ప్రభుత్వం, ఎరువులు కల్తీ అయితే ప్రభుత్వం... రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం..."

అంబేడ్కర్ భవన్‌కి చేరుకునేప్పటికి ఎవరో రాజకీయనాయకుడు అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. సభంతా జేజేలు కొడుతోంది.

"ఏంటా సాహిత్యసభకి ఇంతమంది జనం అనుకున్నా. ఇదీ విషయం... రాజకీయనాయకులు..." నవ్వాడు దయాకర్. కుర్చీల కోసం వెతుకుతూ... ఓ పక్కగా నిల్చుని విసుగ్గా వింటున్నాడా ఉపన్యాసాన్ని సిద్ధార్థ.

"మాట్లాడుతున్న వ్యక్తి ఒక ఐ.ఏ.ఎస్. అధికారి. నాయకుడు కాదు. సమాజానికీ, సామాన్య ప్రజలకూ ఏమాత్రం సంబంధంలేనట్లుగా ఎంత బాధ్యతారహితంగా మాట్లాడుతున్నాడో చూడు," విసుక్కున్నాడు సిద్ధార్థ.

"వీళ్ళంతా గొప్ప మేధావులూ, తెలివితేటలు కలవాళ్ళని ప్రభుత్వం మంచి ఉద్యోగాల్ని కల్పిస్తుంది. కోట్లాదిమంది పేదప్రజలు పన్నులు, శిస్తులు చెల్లించి వీరికి మంచి జీతభత్యాలు, యిళ్ళూ, వాహనాలూ ఒకటేంటి... ప్రభుత్వం డబ్బుతో రాజభోగాలు అనుభవించే ఒక స్థితిని కల్పించారు..." అంటూ ఆగాడు దయాకర్ పక్కన వాళ్ళెవరైనా వింటున్నారేమోనని.

"ఈ నిరుపయోగ మేధావులు ప్రభుత్వాన్ని భుజాన పెట్టుకుని మోస్తారే తప్ప... మామూలు మనుషులకూ, వాళ్ళ అవసరాలకూ వీళ్ళెప్పుడూ దూరంగానే వుంటారు," పూర్తిచేసింది కాంతి.

సిద్ధార్థకి చిరాగ్గా వుంది. ప్రజల యోగక్షేమాలని చూడాల్సిన ఒక అధికారి బాధ్యతారాహిత్యాన్ని లేచి ఖండించాలన్న ఆలోచనని బలవంతం మీద ఆపుకున్నాడు.

"రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరుస్తారా ఎవరైనా?" సిద్ధార్థ అసహనాన్ని గమనించి వాతావరణాన్ని కాస్త తేలికపరుస్తూ గుసగుసగా అంది కాంతి.

తలతిప్పి కాంతి వంక నిశితంగా చూశాడతను .

చిరుచెమటకి ఆమె నుదుటిమీద అంటుకుపోయిన మలి వెంట్రుకల్ని సరిచేసి ఏమీ మాట్లాడకుండా మళ్ళీ వేదికవంక తలతిప్పాడు. ఈలోపుగా "యివిగో... కూర్చోండి" అంటూ రెండు కుర్చీలు వెతుక్కొచ్చాడు దయాకర్. మళ్ళీ మరో కుర్చీకోసం వెళుతూ.

అప్పటికి ప్రముఖ కవి భరద్వాజ బహుమతి పొందిన కవితల్ని గురించి విశ్లేషిస్తూ మాట్లాడుతున్నాడు. మొదటి బహుమతి పొందిన సిద్ధార్థ కవిత ఎంత అద్భుతంగా కవితాహృదయాల్ని ఆకట్టుకుందో చెప్పాడు. న్యాయనిర్ణేతలు ముగ్గురూ కూడా ఆ కవితకే బహుమతి యివ్వడం పట్ల ఏ మాత్రం పేచీ పడలేదని వివరించాడు.

సిద్ధార్థని పదేపదే అభినందిస్తూ సవినయంగా వేదిక మీదకి రావలసిందిగా ఆహ్వానించాడు.

"వెళ్ళు," చెప్పాడు దయాకర్ అతడి కుర్చీ ఖాళీ అవగానే అందులో కూర్చుంటూ. నవ్వింది కాంతి.

"రెండో బహుమతి విజేత కుమారి వెన్నెల," పిలుస్తున్నారు నిర్వాహకులు ఆమెని సభకి పరిచయంజేస్తూ ఆమె వ్రాసిన కవితని గురించికాక ఆమె చక్కదనాన్ని గురించి అభివర్ణించాడు, అభినందించాడు.

వేదిక మీదకి నడుస్తున్న సిద్ధార్థకి అణువణువూ చిరాకుతో నిండిపోతే, ఎక్కడో వెనకాల కూర్చున్న కాంతి కుతకుతా వుడికిపోయింది.

"స్త్రీలు వ్రాస్తున్నందుకు అభినందిచాల్సిందిపోయి వారిని అవహేళన చేస్తారు. లేదా వారి రచనలని త్రోసిరాజని వారి అందానికీ, ఆకర్షణకీ విలువిచ్చి అభినందించడం మొదలుపెడతారు. ఛీ... ఛీ... వీళ్ళంతా పెద్ద సాహితీకారులు. స్త్రీలని గౌరవించాలని ఉపన్యాసాలిస్తారు. పుస్తకాలు వ్రాస్తారు," ఉక్రోషాన్నాపుకోలేక దయాకర్‌తో అంది కాంతి. కాంతి పిడికిలి బిగుసుకుని వుంది.

"అందుకే కాంతీ, సిద్ధార్థ యిటువంటి సభలకి రానని మొరాయిస్తాడు," నవ్వాడు దయాకర్.

"యింకెప్పుడూ పోటీలకు వ్రాయమనిగానీ, సభలకి హాజరుకమ్మని కానీ చెప్పను," ప్రమాణంచేస్తున్నట్లుగా అంది కాంతి.

"అన్ని సభలూ యిలా వుండవు... సభలు పెడుతున్నామంటూ లేదా పోటీలు పెడుతున్నామంటూ డబ్బు చేసుకునేవాళ్ళ సభలు మాత్రమే యిట్లా వుంటాయి. అదిగో మాటాడుతున్నాడు చూడు."

సభా నిర్వాహకుడు తమలపాకుల సుబ్రమణ్యం మాట్లాడుతున్నాడు.

"నఖచిత్రాలంటే గోటితో గీసినవి... పెన్సిలుతోనూ, రంగులతోనూ చిత్రాలు వేయడం మనందరికీ తెలుసు. అవి చాలామంది గీసేవేకూడా... అయితే ఈ నఖచిత్రాలు గీయడంలో ఈ చిత్రకారుడు దేశమంతటా ప్రశస్తి పొందినవాడు."

ఏ కళాకారుడినయినా వేదిక మీద అభినందించడంలో తప్పులేదు కానీ, రాష్ట్ర స్థాయి కవితల పోటీ పెట్టి, బహుమతులొచ్చిన విజేతలని వేదికమీద కూర్చోపెట్టి నఖ చిత్రకళ మీద నయగారాలు పోతూ ఉపన్యసిస్తోన్న నిర్వాహక చక్రవర్తిని ఎలా అర్థంచేసుకోవాలో తెలియలేదు కాంతికి.

అయినా ఈ సభంతా కూడా మొదట్నుంచి కొంత అయోమయంగానే వుంది కాంతికి.

"సిద్ధార్థని చూడు..." చూపించాడు దయాకర్ నవ్వుతూ. తమలో తాము ఏదో మాట్లాడుకుంటూ గందరగోళంగా వున్న జనాల మీదుగా వేదిక మీదనున్న సిద్ధార్థకేసి చూసింది కాంతి. దూరంగా వుండడంతో ముఖంలోని భావాలేమీ తెలీడంలేదు.

"ఎప్పుడెప్పుడీ తద్దినమంతా అయిపోతుందా... బహుమతి డబ్బులు తీసుకుని బయటపడదామా అన్నట్లుగా వున్నాడు కదూ..." నవ్వింది కాంతి.

ఆ ఆవరణలో ఒక మూలగా వున్న వేపచెట్టు మీదినుండి మొదలైన చల్లగాలి తెమ్మెర ఒకటి కాంతి వీపుకి వేడిగా తాకింది. గేటు బయటెక్కడో ఒక ఊరకుక్క ఆపకుండా మొరుగుతోంది ఏం చూసో ఏమో మరి.

నిజంగానే కడుపులో తిప్పినట్టయింది కాంతికి.

గోటితో సృష్టించిన అందమైన ప్రకృతి కాంతబొమ్మని ప్రేక్షకుల వైపుగా చూపెడుతూ,

"ఇంత అద్భుతమైన చిత్రరాజాన్ని ఇవ్వాళ మనం చూడగల్గడం మనందరి అదృష్టం. నిజానికిది నాలుగువేల రూపాయల విలువ చేస్తుంది... దీని వెనుకనున్న శ్రమనీ, ప్రతిభనీ మీరు ఊహించండి. డబ్బుదేముంది. ఇవ్వాళ తీసుకుంటే రేపు ఖర్చు పెట్టేస్తాం. ఇటువంటి గొప్ప బహుమతులైతే జీవితాంతం జ్ఞాపికలుగా మిగిలిపోతాయి. మన జిల్లాపరిషత్‌గారి చేతులమీదుగా కవితల పోటీల్లో మొదటి బహుమతి పొందిన సిద్ధార్ధగారిని ఈ బహుమతి అందుకోవలసిందిగా కోరుతున్నాం." చాలా అద్భుతంగా మాట్లాడాననుకున్నాడు తమలపాకుల సుబ్రమణ్యం.

"హతోస్మి..." మ్రాన్పడిపోయింది కాంతి.

సభంతా కరతాళధ్వనులతో మారుమ్రోగిపోతోంది.

"చచ్చాం," అన్నాడు దయాకర్ జేవురించిన సిద్ధార్ధ ముఖంచూసి. అతడి కుడి చేయి బిగుసుకోవడం దూరంగానే వున్నప్పటికీ దయాకర్, కాంతిలిరువురికీ స్పష్టంగా కన్పిస్తోంది.

ఈరోజొచ్చే రెండువేలా ఐదువందల్ని ఎలా ఖర్చుపెట్టాలో నెలరోజులుగా తామిరువురూ రకరకాల ఆలోచనలు చేశారు. అటువంటిది ఇప్పుడీ నఖచిత్రాన్ని సిద్ధార్ధ ఎలా రిసీవ్ చేసుకుంటాడు?

కాంతి గుండె నరాలెందుకో వణికాయి.

ఆలోచనలలో నుండి తేరుకోకముందే సభంతా గగ్గోలుగగ్గోలుగా ఏదో గందర గోళంలో... దయాకర్ అంటూ పక్కకి చూస్తే అతడులేడు. వేదిక మీదికి చూసిన కాంతి నిర్ఘాంతపోయింది.

ఆ ప్రకృతికాంత నఖచిత్రం... అత్యద్భుతమైన కళగా, చిత్రరాజంగా అభివర్ణించ బడిన ఆ నఖచిత్రం... గోటితో చిత్రించబడిన ఆ రెండడుగుల ప్రకృతికాంత చిత్రాన్ని వేదిక మీదే కింద పడేసి ఛెడామడా తొక్కుతున్నాడు సిద్ధార్ధ.

జడ్పీ ఛైర్మన్ మ్రాన్పడి చూస్తుంటే... నిర్వాహకుల్లో ఒకరిద్దరు మాత్రం,

"ఏయ్ ఏంటిది. నీకేమైనా పిచ్చెక్కిందా?" అంటూ సిద్ధార్ధని వెనక్కి లాగు తున్నారు.

అయితే సిద్ధార్ధ మనోబలం ముందు వారెవ్వరూ జయించడంలేదు.

"ఎవడో మెంటలోడులాగుంది."

"లేదంటే అంత మంచి చిత్రాన్ని అందుకోకుండా ఈ పనేంటి?"

వేదికమీద, కిందా కూడా ఉన్న పెద్దలంతా లేచి నిల్చుని, చేష్టలుడిగి సిద్ధార్థ చర్య మీద రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"అభినందనలు మిత్రమా" రెండో బహుమతి గెలుచుకున్న వెన్నెల వేదిక మీదే పకపకా నవ్వుతూ అభినందిస్తోంది సిద్ధార్థని.

తాను చేయలేని పనేదో అతడు చేయడంవల్ల హర్షం వ్యక్తపరుస్తునట్లుగా వుందామె.

మూడో బహుమతి వచ్చిన వ్యక్తి మాత్రం అసలేం జరుగుతుందో, ఏంచేయాలో అర్థంకాక నివ్వెరపోయి నిలుచున్నాడు.

ప్రూస్పడి చూస్తోన్న కాంతికి కూడ తక్షణ కర్తవ్యం అర్థంకాలేదు.

తాడుని వదల్లేని ఆవు యజమాని చేతికి చిక్కిపోయినట్లు విలవిల్లాడిపోతోంది కాంతి మనసు.

అప్పటికే దయాకర్ వేదిక మీదికి చేరుకున్నాడు .

కాంతి తేరుకుని చూసేటప్పటికి

ప్రపంచాన్ని జయించిన యోధుడిలా పెద్దపెద్ద అంగలేసుకుంటూ గేటువైపుగా నడిచి వెళ్తున్నాడు సిద్ధార్థ.

*చినుకు మాసపత్రిక, మే 2005*